క్లుప్తంగా

వాల్మీకులు ఐకమత్యంగా ఉండాలి



మంత్రి గుమ్మనూరు జయరాంను కలిసిన దైవందిన్నె వాల్మీకి నాయకులు

ఆలూరు: వాల్మీకి కులస్తులు ఐకమత్యంగా ఉండాలని, చిన్నారులను బాగా చదివించాలని కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం సూచించారు. ఎమ్మిగనూరు మండలం దైవందిన్నె గ్రామ వాల్మీకి కులస్తులు వివిధ సమస్యలను గురువారం మంత్రి దృష్టికి తెచ్చారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. వాల్మీకి కులస్తులకు అన్ని విధాలుగా మేలు చేస్తానని హామీ ఇచ్చారు. వాల్మీకులను ఎస్టీ జాబితాలోకి చేర్పించే అంశంపై శాసన సభలో తీర్మానం ప్రవేశపెట్టారని గుర్తు చేశారు. అనంతరం మంత్రిని వాల్మీకి నాయకులు సన్మానించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు శ్రీనివాసులు తదితరులు ఉన్నారు.

పాలిటెక్నిక్ ఎంట్రెన్స్‌కు ఉచిత కోచింగ్

ఆలూరు రూరల్: పాలిటెక్నిక్ ఎంట్రెన్స్ పరీక్ష రాసే విద్యార్థులకు ఈ నెల 17 నుంచి ఉచితంగా కోచింగ్ ఇవ్వనున్నట్లు ఆలూరు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ చిన్నప్ప రెడ్డి తెలిపారు. గురువారం ఆయన పేర్కొంటూ కోచింగ్ తీసుకునే విద్యార్థులకు ఉచితంగా పరీక్షల మెటీరియల్ అందిస్తామన్నారు. ఆసక్తి గల వారు అభ్యర్థులు ఈ నెల 17లోపు కళాశాల ప్రిన్సిపాల్‌ను సంప్రదించాలని సూచించారు.

16 నుంచి ఐఎఫ్‌టీయూ మహాసభలు

ఎమ్మిగనూరుటౌన్: ఐఎఫ్‌టీయూ అఖిల భారత ఏడవ మహాసభలు ఈనెల 16వ తేదీ నుంచి 18 వరకు తిరుపతిలో జరుగనున్నాయని సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ డివిజన్ కార్యదర్శి రాజు పేర్కొన్నారు. గురువారం ఈ మేరకు పట్టణంలో ఆపార్టీ కార్యాలయ ఆవరణలో మహాసభల పోస్టర్లను ఆవిష్కరించారు. మహాసభలకు జాతీయ నాయకులు ప్రదీప్‌తో పాటు పలువురు హాజరుకానున్నారని తెలిపారు. కార్మికులు, పార్టీ శ్రేణులు అధిక సంఖ్యలో తరలివచ్చి జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఐఎఫ్‌టీయూ జిల్లా నాయకులు ప్రసాద్, రైతు కూలీ సంఘ నాయకులు ఏసేపు తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ విద్యార్థులుగా రాణించాలి

మద్దికెర: బాలికలు ఉత్తమ విద్యార్థులుగా రాణించేలా తీర్చిదిద్దాలని జీసీడీఓ సునీత, ఐఈఆర్‌టీ కోఆర్డినేటర్ వెంకటేశ్వర్లు సూచించారు. గురువారం మద్దికెరలోని కస్తూరిబా విద్యాలయాన్ని వారు ఆకస్మికంగా తనిఖీ చేశారు. భోజనాన్ని పరిశీలించి మెనూ ప్రకారం అందిస్తున్నారా లేదా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం అందించిన బైజూస్ ట్యాబ్‌లను విద్యార్థులు ఉపయోగించుకుంటున్న తీరును గమనించారు. ప్రిన్సిపాల్ అబిదాబేగం, ఉపాధ్యాయులు ఉన్నారు.

మిషన్ వాత్సల్యకు 26 వరకు గడువు

ఆలూరు రూరల్: అనాథలు, అభాగ్యులు, తల్లిదండ్రులు కోల్పోయిన పిల్లల చదువు కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెట్టిన మిషన్ వాత్సల్య పథకానికి ఈ నెల 26వ తేదీ వరకు గడువు పొడిగించినట్లు ఆలూరు ఐసీడీఎస్ సీడీపీఓ లలిత తెలిపారు. ఆమె గురువారం మాట్లాడుతూ ప్రాజెక్టు పరిధిలో 177 అంగన్‌వాడీ కేంద్రాల నుంచి ఇప్పటివరకు వంద దరఖాస్తులు వచ్చాయన్నారు. ఈ పథకం కింద అర్హులైన పిల్లలకు స్కాలర్‌షిప్ కింద నెలకు రూ.4 వేలు చొప్పున అందిస్తారని చెప్పారు.

దరఖాస్తుకు ఇక్కట్లు

మద్దికెర: కేంద్రప్రభుత్వం తల్లిదండ్రులు లేని పిల్లలను ఆదుకోడానికి అమలు చేసిన వాత్సల్య పథకానికి దరఖాస్తు చేసుకునేందుకు అంగన్‌వాడీ అధికారులు అందుబాటులో లేకపోవడంతో దరఖాస్తుదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఏపీ ధ్రువపత్రాలు జతచేయాలో తెలియక పిల్లల బంధువులు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు.

కాపీయింగ్‌కు పాల్పడితే చర్యలు

కృష్ణగిరి: ఓపెన్ స్కూల్ ఇంటర్ పరీక్షల్లో మాస్‌కాపీయింగ్‌కు పాల్పడితే సంబంధిత అధికారులపై చర్యలు తప్పవని ఓపెన్ స్కూల్ జిల్లా మానిటరింగ్ అధికారి మైఖేల్ హెచ్చరించారు. గురువారం ఆయన కృష్ణగిరిలోని ఇంటర్ పరీక్ష కేంద్రాన్ని తనిఖీచేశారు. కేంద్రాల్లో తాగునీరు, ఫ్యాన్, వైద్య సదుపాయాలు కల్పించామన్నారు. ఈ కేంద్రంలో 155 మందికి గాను 147 మంది పరీక్షకు హాజరైనట్లు తెలిపారు.

ముగిసిన ఉత్సవాలు

ఆస్పరి: మండలంలోని బిణిగేరిలో ఆంజినేయ స్వామి, శంకరబండలోని లింగమేశ్వర స్వామి ఉత్సవాలు గురువారం వసంతోత్సవంతో ముగిశాయి. ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేసిన స్వామివార్ల పల్లకీలను ఊరేగించారు. యువకులు రంగులు చల్లుకుంటూ ఆనందోత్సాహాలతో ఉత్సవంలో పాల్గొన్నారు.

మారుతున్న అగ్రి‘కల్చర్’

సాంప్రదాయ పంటల సాగుకు సాంకేతికత తోడవుతోంది. పుడమినే నమ్ముకున్న రైతన్నకు ప్రభుత్వం దన్నుగా నిలుస్తోంది. వ్యవసాయం దండగ అన్న గత పాలకుల కుటిల ఆలోచనలను పటాపంచలు చేస్తూ వ్యవసాయమే నేటి సమాజానికి అండా.. దండా అనే స్థాయిని కల్పించింది నేటి ప్రభుత్వం. ఫలితంగా వ్యవసాయ రంగంలో వినూత్న మార్పులు సంతరించుకుంటున్నాయి. అగ్రి ‘కల్చర్’లో మార్పులు మొగ్గ తొడుగుతున్నాయి.

- పంటల సాగుకు సాంకేతిక దన్ను
- పెరుగుతున్న యాంత్రీకరణ
- తగ్గుతున్న వ్యయప్రయాసలు



వరి కోత చేస్తున్న మిషన్

ఎమ్మిగనూరు: వ్యవసాయం, పాడి పంటలు అన్నదాతకు రెండు కళ్లలాంటివి. వ్యవసాయ భూమితో పాటు పాడి పశువులు ఎక్కువగా ఉండే వారిని భూస్వామిగా పిలిచేవారు. నాడు వ్యవసాయం చేయాలంటే రైతింట దుక్కిదున్నే కాడెద్దులు ఉండాలి. సాగు పనులు చేసేందుకు విరివిగా కూలీలు అందుబాటులో ఉండాలి. దీనివల్ల రైతులంతా సీజన్‌లో ఒకేసారి పంటసాగు చేయాలంటే ఇబ్బందిగా ఉండేది. దానికి తోడు పశుగ్రాసం కొరత, నిర్వాహణ భారంతో కాడెద్దులను పోషించే సహనం, శక్తి-సామర్థ్యాలు చాలామంది రైతుల్లో నేడు కనిపించడం లేదు. విజ్ఞాన శాస్త్రం విస్తరించడంతో వ్యవసాయంలో మార్పులొచ్చాయి. సాగు కల్చర్‌లో సాంకేతికత భాగమైంది.

యాంత్రీకరణ దిశగా..

యాంత్రీకరణతో సాగు సులభతరం అయ్యింది. వ్యవసాయ పనుల్లో యంత్రాల ప్రాధాన్యత పెరిగింది. దుక్కి దున్నడం మొదలు కోతలు, పంట నూర్పిడి వరకూ యంత్రాలను వినియోగిస్తున్నారు. ఖరీఫ్ పంటలో విత్తన సాగు (గొర్రు విత్తనం) మినహా ఎద్దుల ప్రాధాన్యతను తగ్గిస్తున్నారు. రోజుల్లో జరిగే పనులను గంటల్లోనే పూర్తి చేస్తున్నారు. దుక్కి దున్నేందుకు ట్రాక్టర్లు, మినీట్రాక్టర్లు, రోటావేటర్ల వినియోగం పెరిగింది. వరినాట్లకు డ్రమ్ సీడర్లు వాడుకలోకి వచ్చాయి. కోత మిషన్లు, పంటనూర్పిడి యంత్రాలు వ్యవసాయాన్ని మరింత సులభతరం చేశాయి.

ప్రభుత్వ చేయూత

వ్యవసాయ రంగంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా యంత్రాల ప్రాధాన్యతను గుర్తించిన ప్రభుత్వం రైతులకు రోటావేటర్లు, ఉల్లి విత్తన గొర్రులు, ట్రాక్టర్లను సబ్సిడీతో అందిస్తోంది. సహకార బ్యాంకులు పంటనూర్పిడి యంత్రాలు, కోత మిషన్లకు విరివిగా రుణాలు అందిస్తున్నాయి. మండలం యూనిట్‌గా డ్రోన్లను సరఫరా చేసేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నారు. భూసార పరీక్షలు మొదలు సబ్సిడీ విత్తనాలు, ఎరువులు అందించడం, రైతు భరోసా కింద పెట్టుబడి సాయం అందించడం, పండిన పంటకు గిట్టుబాటు ధరలు లేకపోతే ప్రభుత్వమే కొనుగోలు చేయడం వంటి చర్యలతో ప్రభుత్వం రైతన్నకు అండగా నిలుస్తోంది. ప్రత్యేకంగా వ్యవసాయ రంగాన్ని మరింత లాభసాటిగా మార్చేందుకు ప్రతి పంచాయతీ పరిధిలో రైతు భరోసా కేంద్రాన్ని ఏర్పాటు చేయడం, పండిన పంట ఉత్పత్తుల నిల్వ కోసం గోడౌన్ల నిర్మాణం చేపట్టడం అందులో భాగంగా మారింది.



ట్రాక్టర్ సాయంతో దుక్కి దున్నుతున్న రైతు

సాగు పద్ధతుల్లో మార్పులొస్తున్నాయి



సాంప్రదాయ సాగుకు సాంకేతిక విజ్ఞానాన్ని జోడించి రైతులు పంటలు పండిస్తున్నారు. సాగు పద్ధతుల్లో గతానికి, నేటికి చాలా మార్పులొచ్చాయి. పంటల సాగులో యంత్రాల వినియోగం పెరగడంతో వ్యవసాయాన్ని సులభతరం చేశాయి. ప్రభుత్వ సహకారం రైతన్నకు మరింత ఊతమిస్తోంది.

– మహ్మద్ ఖాద్రి, ఏడీఏ

నేడు లంకాయపల్లిలో ‘జీజీఎంపీ’

తుగ్గలి: మండల పరిధిలోని లంకాయపల్లిలో శుక్రవారం ఉదయం ‘గడప గడపకు మన ప్రభుత్వం’ కార్యక్రమం నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ నాయకులు హనుమంతరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి పాల్గొంటారన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు హాజరు కావాలని ఆయన కోరారు.

అంబేడ్కర్ జయంతికి ఏర్పాట్లు

ఎమ్మిగనూరుటౌన్: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకొని పట్టణంలోని పలు ప్రాంతాల్లో ఉత్సవాలకై ముమ్మర ఏర్పాట్లు చేస్తున్నారు. గురువారం పట్టణంలోని అంబేడ్కర్ సర్కిల్ వద్ద పారిశుద్ధ్య పనులతో పాటు రాఘవేంద్ర కళాశాల వద్ద అంబేడ్కర్ భవనానికి కేటాయించిన స్థలాన్ని మున్సిపల్ అధికారులు జేసీబీలతో చదును చేయించారు. ఆయా పనులను మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి, డీఈ మనోహర్‌రెడ్డి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులుతో పాటు వైఎస్సార్‌సీపీ పట్టణ అధికార ప్రతినిధి సునీల్‌కుమార్ పరిశీలించారు. అలాగే స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో, ప్రధాన రహదారిలో ఉత్సవాలకు ఏర్పాట్లు చేశారు.

ఏడుగురు గైర్హాజరు

నందవరం: మండలంలో గురువారం నిర్వహించిన పదో తరగతి పబ్లిక్ సైన్స్ పరీక్షకు ఏడుగురు విద్యార్థులు గైర్హాజరైనట్లు ఎంఈఓ సుదర్శన్ రెడ్డి తెలిపారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కేంద్రంలో 220 మంది గాను 218, కస్తూర్బా పాఠశాలలో 43 మంది గాను 42, స్పెషల్ ఎంపీపీ పాఠశాలలో 100 మంది విద్యార్థులకు గాను 96 మంది హాజరయ్యారు. సప్లిమెంటరీ విద్యార్థులు 58 మందికి గాను అందరూ హాజరయ్యారు.

మే 15 నాటికి విద్యాకానుక సిద్ధం

వెల్దుర్తి: ప్రభుత్వం విద్యార్థులకు అందిస్తున్న ‘జగనన్న విద్యా కానుక (జేవీకే)’ కిట్లను మే 15 నాటికి సిద్ధం చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు జేవీకే రాష్ట్ర పరిశీలకులు ఆర్ నరసింహారావ్, సమగ్ర శిక్షా అభియాన్ అడిషనల్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్, జేవీకే-4 స్పెషల్ ఆఫీసర్ డాక్టర్ కె వేణుగోపాల్ తెలిపారు. గురువారం వారు వెల్దుర్తి, కృష్ణగిరి మండలాల్లో జేవీకే కిట్ల నిల్వ చేసేందుకు అవసరమైన కేంద్రాలను పరిశీలించారు. వెల్దుర్తిలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకులం నిల్వ కేంద్రంలో భద్రత, ఇతర అంశాలను పరిశీలించారు. వారు మాట్లాడుతూ కిట్లను సకాలంలో పంపిణీ చేసేందుకు ఎంఈఓ ఆధ్వర్యంలో ఎనిమిది టీంలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. యూనిఫాం, షూస్, బ్యాగ్, పుస్తకాలు తదితరాల కిట్లతోపాటు 32,640 ఆక్స్‌ఫర్డ్ డిక్షనరీలు సైతం జిల్లా కేంద్రానికి చేరుకున్నాయని వెల్లడించారు.

47వేల ఎకరాలకు సాగునీరందించాం

ఎమ్మిగనూరు: తుంగభద్ర దిగువ కాలువ ద్వారా రబీలో 47 వేల ఎకరాలకు సాగునీరందించామని ఆదోని డివిజన్ ఎల్లెల్సీ ఈఈ శైలేశ్వర్ తెలిపారు. గురువారం ఎల్లెల్సీ ఎమ్మిగనూరు సబ్ డివిజన్‌ను సందర్శించి వేసవిలో ఎల్లెల్సీ పటిష్టతకు తీసుకోవాల్సిన చర్యలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కిందిస్థాయి నుంచి ఎల్లెల్సీ సిబ్బంది పర్యవేక్షణ, ఉన్నత స్థాయిలో ఈఈ శేఖర్‌రెడ్డి ప్రత్యేక చొరవ, రైతుల సహకారం వల్లే ఇది సాధ్యమైందని పేర్కొన్నారు. హగరిపై ఎల్లెల్సీ కాలువ పిల్లర్లు కొట్టుకుపోయినప్పుడు పంట నష్టం జరగకుండా చర్యలు చేపట్టడటం సంతృప్తినిచ్చిందన్నారు. హగరిపై ఎల్లెల్సీ కాలువను పటిష్టం చేసేందుకు రూ.40కోట్లతో పనులు చేపడుతున్నారని, వేసవిలో ఎల్లెల్సీ, గాజులదిన్నె ప్రాజెక్టుల పటిష్టత, మరమ్మతులకు రూ.6 కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు తెలిపారు. రైతులు కూడా సాగునీటి తీరువా (శిస్తు) చెల్లించి ఎల్లెల్సీ అభివృద్ధికి సహకరించాలని కోరారు. డీఈ లక్ష్మణ్ కుమార్, ఏఈలు రామాంజినేయులు, మణికంఠ, పాల్గొన్నారు.



రైతులతో మాట్లాడుతున్న ఈఈ శైలేశ్వర్

పంటలకు జీవం పోశారు

ఎంఎల్ఎస్‌పీ డిస్ట్రిబ్యూటరీ పరిధిలో ఎండుతున్న పంటలకు జీవం పోసి ఆదుకున్నారని, అందుకు రైతులంతా రుణపడి ఉన్నామంటూ అలువాల, పెద్దమర్రివీడు రైతులు ఈఈ శైలేశ్వర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఎల్లెల్సీకి గండి పడినప్పుడు పంటలు ఎండిపోతుంటే గాజులదిన్నె ప్రాజెక్టు నుంచి నీరందించారని, దీంతో మిరప, పత్తి దిగుబడులు బాగా వచ్చాయని పేర్కొన్నారు. వెంకట్రామిరెడ్డి, రాముడు నేతృత్వంలో 30 మంది రైతులు ఈఈ, డీఈ, ఏఈలను పూలమాల వేసి దుశ్శాలువాలతో సత్కరించారు.

నిందితుల అరెస్ట్

పత్తికొండ రూరల్: మండల పరిధిలోని బుగ్గతండా సమీపంలో నాటుసారా స్థావరాలపై తనిఖీ నిర్వహించేందుకు వెళ్లిన సెబ్ సిబ్బందిపై దాడులకు పాల్పడిన నిందితులను గురువారం అరెస్టు చేసినట్లు సీఐ మురళీమోహన్ తెలిపారు. తెల్లవారుజామున విజయవాడకు చెందిన సెబ్ స్పెషల్ టీం ఎస్ఐ ఓబులేసు సిబ్బందితో కలిసి కొండప్రాంతంలో నాటుసారా తయారీ కేంద్రం వద్దకు వెళ్లగా తండావాసులు రంగానాయక్, కృష్ణానాయక్, జాప్లా, రవి, రంగా, నెట్టికంఠయ్య, శ్రీరామనాయక్‌లు చుట్టుముట్టి దాడికి తెగబడ్డారన్నారు. ఘటనలో బుధవారం ముగ్గురిని అరెస్టు చేయగా పరారీలో ఉన్న మిగతా నలుగురిని గురువారం అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు వివరించారు.



అరెస్టయిన నిందితులు

జిల్లా ఎస్పీ, జేసీలను కలిసిన ఎమ్మెల్యే



జిల్లా ఎస్పీ కృష్ణకాంత్, జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్యకు పుష్పగుచ్ఛం అందిస్తున్న ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి

ఎమ్మిగనూరుటౌన్: జిల్లా ఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన కృష్ణకాంత్, జాయింట్ కలెక్టర్‌గా నియామకమైన నారపురెడ్డి మౌర్యలను జిల్లా కేంద్రంలో గురువారం ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. శాలువాకప్పి పుష్పగుచ్ఛం ఇచ్చి ఎమ్మెల్యే వారిని సత్కరించారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో పలు సమస్యలపై వారితో చర్చించారు. వైఎస్ఆర్‌సీపీ నాయకులు జానకిరామిరెడ్డి వెంట ఉన్నారు.



వెల్దుర్తి పాతబస్టాండులో ఎండలో ప్రజలు

ఠారెత్తిస్తున్న ఎండలు

వెల్దుర్తి: ఎండలు మండుతుండడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. మండల కేంద్రానికి ప్రతిరోజు వివిధ మండలాలు, గ్రామాల నుంచి వేల మంది ప్రజలు రాకపోకలు సాగిస్తున్నారు. ఆదివారం సంత రోజులలో రెట్టింపుగా జనం వస్తుంటారు. ప్రస్తుత వేసవి పరిస్థితులలో మండలంలో వేసవి తాపం 40 డిగ్రీలు దాటుతోంది. స్థానిక పాత బస్టాండు, కొత్తబస్టాండు ప్రాంతంలో ప్రయాణికులకు, ప్రజలకు దప్పిక కష్టాలు తప్పడంలేదు. విధిలేని పరిస్థితులలో నీళ్ల ప్యాకెట్లు, నీళ్ల బాటిళ్లు కొంటున్నారు. కొనలేని వారు హోటళ్లు, దుకాణాలను ఆశ్రయిస్తున్నారు. ప్రయాణికులకు నిలిచేందుకు నీడ సైతం కరువైంది. నీడ కోసం దుకాణాలను ఆశ్రయిస్తే దుకాణదారుల ఛీదరింపులు తప్పడంలేదు. నీడలేని పరిస్థితులలో ప్రయాణీకులు ఎండవేడిమి భరించలేక కళ్లు తిరిగి పడిపోయిన సంఘటనలున్నాయి. వడదెబ్బకు గురై ఆస్పత్రి పాలైన సందర్భాలున్నాయి. ప్రతి ఏడాది వేసవి ఎండల తీవ్రత ప్రారంభం కాగానే చలివేంద్రాలు, చలువ పందిళ్లు ఏర్పాటు చేస్తూ వస్తున్న పంచాయతీ సిబ్బంది ప్రస్తుతం పట్టించుకోకపోవడంపై విమర్శలు ఎదురవుతున్నాయి. రద్దీ ప్రాంతాలలో చలివేంద్రాలు, చలువ పందిళ్లు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

సమయపాలన పాటించండి

మద్దికెర: సచివాలయ సిబ్బంది సమయపాలన పాటించకపోతే కఠిన చర్యలు తీసుకుంటామని రోజుకు మూడు సార్లు బయోమెట్రిక్ హాజరు నమోదు చేయాలని ఎంపీడీఓ నరసింహమూర్తి ఆదేశించారు. గురువారం మద్దికెరలోని 1, 2 సచివాలయాలను ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులు పరిశీలించి సిబ్బందితో సమావేశం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. సిబ్బంది మధ్యాహ్నం 3 గంటల నుంచి 5 గంటల వరకు కార్యాలయంలో అందుబాటులో ఉండాలన్నారు. కార్యాలయ పనిమీద వెళ్లేటప్పుడు మూమెంట్ రిజిస్టర్‌లో నమోదు చేయాలన్నారు. ఈఓ రాధ, డిజిటల్ అసిస్టెంట్లు గోవిందు,తదితరులు ఉన్నారు.

బీమా తక్షణసాయం అందజేత

హొళగుంద: హెబ్బటం గ్రామంలో ఈ నెల 8న గుండెజబ్బుతో మరణించిన ఉలుగప్ప అనే వ్యక్తి భార్య శేఖమ్మకు వైఎస్సార్‌బీమా తక్షణసాయం కింద మంజూరైన రూ.10 వేలను వెల్ఫేర్ అసిస్టంట్ ఎర్రిస్వామి, వైఎస్సార్‌సీపీ నాయకులు గురువారం అందజేశారు. మిగతా సొమ్ము త్వరలో నామినీ బ్యాంకు ఖాతాలో జమ అవుతుందని తెలిపారు.

తప్పిన అగ్ని ప్రమాదం

ఆలూరు రూరల్: ఫైర్ అధికారులు సకాలంలో స్పందించడంతో భారీ అగ్ని ప్రమాదం తప్పింది. బుధవారం రాత్రి 11.30 గంటలకు ఆలూరు సమీపంలోని గుంతకల్లు రోడ్డులో ప్రమాదవశాత్తు చెత్తకు నిప్పంటుకుంది. నిప్పంటుకున్న 10 మీటర్ల సమీపంలో 15కు పైగా గడ్డివాములు ఉన్నాయి. స్థానికులు గమనించి అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. ఫైర్ సిబ్బంది సకాలంలో వచ్చి మంటలార్పి వేయడంతో పెను ప్రమాదం తప్పింది.

భూసార పరీక్షలతో మేలు

పత్తికొండ రూరల్: భూసార పరీక్షలతో అధిక దిగుబడులు సాధించవచ్చని మాస్టర్ ట్రైనర్ శ్రీనాథ్ అన్నారు. గురువారం స్థానిక ఆర్బీకే-1లో ఏఓ వెంకట్రాముడు అధ్యక్షతన వీఏఏ, వీహెచ్ఏలు, ఎంపీఈఓలకు మట్టినమూనాల సేకరణపై అవగాహన కల్పించారు. భూసార పరీక్షలు చేయించుకోవడం వల్ల కలిగే ఉపయోగాలను రైతులకు తెలియజేయాలని సూచించారు. ఏఈఓలు రియాజ్‌బాషా, లక్ష్మిచైతన్య, సరస్వతి పాల్గొన్నారు.

హొళగుంద: భూసార పరీక్షలు చేయించడం వల్ల రైతులకు పెట్టుబడి ఖర్చు తగ్గడంతో పాటు మంచి దిగుబడి పొందవచ్చని ఏఓ నరేంద్రకుమార్, చిన్నహ్యాట వీఏఏ తస్లిమా సూచించారు. గురువారం చిన్నహ్యాట గ్రామంలో రైతులకు పంటల సాగు, భూసార పరీక్షల వల్ల కలిగే లాభాలు తదితర అంశాల గురించి అవగాహన కల్పించారు. పెట్టుబడిలేని ప్రకృతి వ్యవసాయం, సేంద్రియ ఎరువుల తయారు, వాడక విధానం గురించి వివరించారు.

కేంద్ర విధానాలపై పోరాటం

ఎమ్మిగనూరుటౌన్: కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై సమరశీల పోరాటం చేసి బీజేపీని ఇంటికి సాగనంపాలని సీపీఐ నాయకులు పంపణ్ణగౌడ్, రంగన్నలు పిలుపునిచ్చారు. స్థానిక సీపీఐ కార్యాలయ ఆవరణలో సీపీఐ, సీపీఎంల ఆధ్వర్యంలో చేపట్టనున్న ప్రచార భేరి పాదయాత్ర పోస్టర్లను గురువారం ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ శుక్రవారం నుంచి 30వ తేదీ వరకు పాదయాత్ర నిర్వహించనున్నట్లు తెలిపారు.

బయోమెట్రిక్ తప్పనిసరి

చిప్పగిరి: ప్రభుత్వ పాఠశాలల్లో విధులు నిర్వహించే ఉపాధ్యాయులు తప్పనిసరిగా బయోమెట్రిక్ హాజరు నమోదు చేయాలని ఎంఈఓ మస్తాన్‌రావు సూచించారు. ఆయన గురువారం మాట్లాడుతూ.. ఈ నెల 3 నుంచి ఒంటిపూట బడులు ప్రారంభమయ్యాయని, ప్రభుత్వ నిబంధనల మేరకు ఉదయం 7.45 గంటలకే ముఖ ఆధారిత హాజరు నమోదు చేయాలన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఆలయ చైర్మన్ ఎంపిక

మద్దికెర: మండల పరిధిలోని ఎం.అగ్రహారం గ్రామంలో అవధూత పక్కీరప్ప తాత దేవస్థానం చైర్మన్‌గా ఉటుకూరు రిత్విక్‌రెడ్డిని ఎంపిక చేసుకున్నట్లు సర్పంచ్ విజయుడు, గ్రామ పెద్దలు శ్రీనివాసరెడ్డి, మాజీ సర్పంచ్ లక్ష్మన్న, శివప్ప, రేవప్ప, నారాయణస్వామి తెలిపారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానన్నారు.

నాడు-నేడు పనులు పూర్తి చేయండి

కృష్ణగిరి: రెండో విడత నాడు-నేడు పనులను జూన్ మొదటి వారానికల్లా పూర్తి చేయాలని జిల్లా సమగ్ర శిక్ష పథక అధికారి డాక్టర్ వేణుగోపాల్ ఆదేశించారు. గురువారం ఆయన కృష్ణగిరి కస్తూర్బా విద్యాలయంలో అదనపు గదుల నిర్మాణాన్ని పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ.. జిల్లా వ్యాప్తంగా రెండో విడత నాడు-నేడు కింద అదనపు గదులతో కలిసి 1081 పాఠశాలల్లో రూ.514 కోట్లతో పనులు చేపట్టాల్సి ఉందన్నారు. ఇప్పటి వరకు రూ.153 కోట్లు మంజూరు కాగా ఆర్ఎఫ్ కింద వంద కోట్లు ఖర్చు చేశామన్నారు. మిగతా సొమ్ము ఖాతాలకు జమ కావడం జరిగిందని, పనులు ప్రారంభించి జూన్ మొదటి వారానికల్లా పూర్తి చేయడంలో ప్రధానోపాధ్యాయులు, పీఎంసీ చైర్మన్లు కీలకపాత్ర వహించాలన్నారు. నిధులను ప్రాధాన్యతా క్రమంలో వినియోగించుకుని టాయిలెట్లు, తాగునీరు మరమ్మతులు, కిచెన్ షెడ్లు, విద్యుత్ సౌకర్యం తదితర పనులు చేయించాలని సూచించారు. అలాగే ప్రతి రోజు పనుల పురోగతి ఫొటోలను సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్లు అప్‌లోడ్ చేయాలన్నారు. కృష్ణగిరి మండలంలో అదనపు గదులతో కలిపి 38 పాఠశాలల్లో పనులు చేపట్టేందుకు రూ.16 కోట్లు మంజూరుకాగా ఇప్పటివరకు రూ.3.29 కోట్లు ఖర్చు చేసినట్లు తెలిపారు. అనంతరం జగనన్న విద్యా కానుక కను భద్రపరిచేందుకు స్థానిక జెడ్పీ పాఠశాలలో గదులను పరిశీలించారు. ఏఎంఓ శివశంకర్, జీసీడీఓ రాజేశ్వరి, ఎంఎస్ కో-ఆర్డినేటర్ రాజేష్, సీఆర్పీలు కృష్ణమూర్తి, వీరనాగప్ప, మధు వెంట ఉన్నారు.



కృష్ణగిరి కస్తూర్బా విద్యాలయంలో అదనపు గదుల నిర్మాణాన్ని పరిశీలిస్తున్న డాక్టర్ వేణుగోపాల్

పేదలకు అండగా ప్రభుత్వం



లక్ష్మినగర్‌లో ప్రజల అభిప్రాయాన్ని నమోదు చేసుకుంటున్న ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి

తుగ్గలి: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పేదలకు అండగా నిలుస్తోందని, ముఖ్యమంత్రి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు పేదల ఇళ్లలో ఆనందం నింపుతున్నాయని ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి అన్నారు. గురువారం సాయంత్రం రోళ్లపాడు, రోళ్లపాడుతండా, ఎల్లమ్మగుట్ట తండాలో ‘గడప గడపకు మన ప్రభుత్వం’ కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి నాలుగేళ్లలో చేకూరిన లబ్ధిని ప్రజలకు వివరించారు. ప్రజలు ఆమె దృష్టికి తీసుకొచ్చిన సమస్యలను పరిష్కరించాల్సిందిగా అధికారులకు సూచించారు.

దళారీ వ్యవస్థకు చెక్: దళారీ వ్యవస్థకు చెక్ పెడుతూ సంక్షేమ పథకాల ద్వారా నగదును నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లోకి జమ చేస్తున్న ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందన్నారు. పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలు అందిస్తున్నామన్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో ఆ పార్టీ నాయకులు, జన్మభూమి కమిటీ సభ్యుల దయ ఉన్నోళ్లకే పథకాలు అందేవని గుర్తు చేశారు. ఇప్పుడు అర్హత ఉంటే చాలు పథకాలు ఇంటి ముంగిటకే వస్తున్నాయన్నారు. పేదలకు అండగా నిలుస్తున్న ప్రభుత్వానికి మద్దతు తెలపాలని కోరారు. వైఎస్సార్‌సీపీ నాయకులు రామచంద్రారెడ్డి, నాగేష్, మోహన్‌రెడ్డి, అమరనాథ్‌రెడ్డి, జెడ్పీటీసీ పులికొండనాయక్, వైస్ ఎంపీపీ ఎర్రనాగప్ప తదితరులు పాల్గొన్నారు.

ప్రజా నాయకుడు జగనన్న

పత్తికొండటౌన్: ప్రజల కోసం పనిచేసే నాయకుడు జగనన్న అని ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి అన్నారు. గురువారం ఉదయం పత్తికొండ పట్టణం గ్రామసచివాలయ-5 పరిధిలోని లక్ష్మినగర్ కాలనీలో ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి ఆధ్వర్యంలో ‘మా నమ్మకం నువ్వే జగనన్న’ కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. ప్రజల అభిప్రాయాలను నమోదు చేసుకున్నారు. టోల్‌ఫ్రీ నంబరు 82960 82960కు మిస్డ్ కాల్ ఇప్పించి, సీఎం జగనన్న సందేశాన్ని వారికి వినిపించారు. ఎంపీపీ నారాయణదాసు, సర్పంచ్ కొమ్ముదీపిక, నాయకులు ఎస్.నాగరత్నమ్మ, పల్లె ప్రతాప్‌రెడ్డి, లలితారామచంద్ర, శ్రీరంగడు, సోమశేఖర్, కారం నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా ‘మా నమ్మకం నువ్వే జగనన్న’

ఎమ్మిగనూరుటౌన్: ‘మా నమ్మకం నువ్వే జగనన్న’ కార్యక్రమం గురువారం పట్టణంలో ఉత్సాహంగా కొనసాగింది. ఆయా వార్డుల్లో వైఎస్ఆర్‌సీపీ వార్డు కౌన్సిలర్లు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతున్న తీరును లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. పట్టణంలోని 30, 31వ వార్డుల్లో వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సీనియర్ నాయకుడు ఎర్రకోట జగన్‌మోహన్‌రెడ్డి చేనేత కుటుంబాల వారి యోగక్షేమాలు తెలుసుకుండా గత టీడీపీ, ప్రస్తుత వైఎస్సార్‌సీపీ పాలనపై ప్రజల అభిప్రాయాలను తెలుసుకుంటూ ఇళ్లకు జగనన్న స్టిక్కర్లను అతికించారు. వైస్ చైర్మన్ నజీర్‌అహమ్మద్, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

గోనెగండ్ల: మండలంలోని గోనెగండ్ల, పెద్దనేలటూర్, చిన్న నేలటూర్, గంజిహళ్లి తదితర గ్రామాల్లో వైస్ ఎంపీపీ వెంకట్రామిరెడ్డి, మండల కన్వీనర్ దొరబాబు ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీ శ్రేణులు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించారు. ప్రజల అభిప్రాయాలను నమోదు చేసుకున్నారు.

కృష్ణగిరి: మండల పరిధిలోని చుంచుఎర్రగుడి, టి.గోకులపాడు, పోతుగల్లు, చిట్యాల తదితర గ్రామాల్లో వైఎస్సార్‌సీపీ నాయకులు లక్ష్మికాంతరెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, తిమ్మరాజు, వెంకటేష్ ఆధ్వర్యంలో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం నిర్వహించి ఇంటింటికీ జగనన్న స్టిక్కర్లను అతికించారు.

హొళగుంద: మండల పరిధిలోని కోగిలతోట, మార్లమడికి, నెరణికి, లింగంపల్లి తదితర గ్రామాలలో వైఎస్సార్‌సీపీ నాయకులు వెంకటేష్, నాగప్ప, చంద్ర, మౌనేష్, తదితరులు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పాలనపై ప్రజల అభిప్రాయాలను నమోదు చేసుకున్నారు.

నందవరం: మండల కేంద్రంతో పాటు మాచాపురం, హాలహర్వి, ధర్మపురం, జగ్గాపురం, నదికైరవాడి తదితర గ్రామాల్లో సర్పంచ్ కిష్టప్ప, వైఎస్సార్‌సీపీ నాయకుడు కోటేశ్వరరావు ఆధ్వర్యంలో ‘జగనన్నే మా భవిష్యత్తు’ కార్యక్రమం నిర్వహించారు.



ఎమ్మిగనూరులో వృద్ధురాలితో మాట్లాడుతున్న ఎర్రకోట జగన్